# షెగువారా

నాలుగు దశాబ్దాలయినా నిండుగా జీవించని శంకరుడు దేశం నాలుగు చెరగులా చీకటిని ఛేదించి, వెలుగు దీపాలను నింపి ఈజాతిని సాంస్కృతికంగా ఒకటిచేస్తే—

నాలుగు దశాబ్దాలు నిండకుండానే చీకటి తాపానికి ఎర ఆయిన షెగువారా లాటిన్ అమెరికా నాల్గు చెరగులా విప్లవ జ్యోతిని వెలిగించి ఆ మహా యజ్ఞంలో తానొక సమిధయిపోయాడు.

—నియంతల పాలిట సింహస్వప్నమయిన షెగువారాతో 1964 మేరియో రొసాలియా గువారా అన్నావిడ స్పెయిన్‌లో బంధుత్వం కలపబోయి "మీ పుట్టిన చోటేదీ ?" అని అడిగితే— అతడు— "కామ్రేడ్ ! మా పూర్వీకులు కట్టుబట్టలయినా లేకుండా స్పెయిన్ వదలి వచ్చారు. అంచేత నువ్వు నాకు బంధువు కాకపోవచ్చు.... కాని ఎక్కడ అన్యాయం జరిగినా నువ్వు ఆగ్రహంతో కదిలే దానివయితే మనమిద్దరమూ బంధువులమే !" అన్నాడట.

చిన్ననాటినుండే శాపంలాగున ఆస్త్మారాక్షసి అనునిముషమూ పీక్కుతింటున్నా, జీవితం పొడవునా అన్యాయాన్ని, అస్వాతంత్ర్యాన్ని, అధర్మాన్ని ఎదిరించిన ఆ ఎవరెస్టు శిఖరం— అసలు పేరు ఎర్నెస్టో గువారా. అర్జెంటినాలో పుట్టిన ఇతడు క్యూబాలో ఫిడెల్ కాస్ట్రోతో కలిసి గెరిల్లా యుద్ధం చేస్తుండగా విప్లవవాదు లాతడికి పెట్టిన ముద్దుపేరు 'షె'. క్యూబాలో కీలుబొమ్మ ప్రభుత్వం కీళ్ళన్నీ పూడదీశాక తాను క్యూబా

జాతీయ బ్యాంకికి డైరెక్టరుగా వుండగా అతడు ఆ దేశపు కరెన్సీ నోట్లమీద 'షె' అనే సంతకం చేసేవాడు. ఒక ప్రశ్నకు సమాధానంగా అతడు 'షె' అన్నదే నాజీవితంలో అతి ప్రధానమయిన దానికి సంకేతం నా పేరయిన 'ఎర్నెస్టో'కు గాని, ఇంటి పేరయిన 'గువారా'కు గాని అంత ప్రాధాన్యం లేదు— ఎందుకంటే అవి చాలా స్వల్పమయిన, వ్యక్తిగతమయిన సంబంధాలను సూచిస్తాయి—" అని భాష్యం చెప్పాడట.

పీడిత ప్రజలంటే చెరువయే గుండె వుంది. ఆ గుండెయే అగ్రరాజ్యాల కుతంత్రాలకు కుతకుత ఉడికి కుంపటిగా మారగా ఆ నిప్పు కణాలను గెరిల్లా వాయువు నలుదిక్కుల విసరగా దేశాల సరిహద్దులను చెరిపివేసిన వాడిని— ఒక దేశం, ఒక భాష, ఒక కుటుంబం, ఒక బాంధవ్యం ఎలా బంధించగలవు ?

1928 లో పుట్టి, 53లో వైద్య శాస్త్రంలో పట్టభద్రుడయేలోగానే కనబడినదెల్లా చదివిన జ్ఞానమూర్తి షె. నూనె ఓడమీద పనిచేస్తూ చిలీ, పెరూ, కొలంబియా, వెనిజూయెలాలు తిరిగి, రానున్న రంగానికి సిద్ధమయిన కిశోరం షె. ఆ క్షణం అసన్నమయినపుడు అక్షరాలా స్టెతస్కోపు నవతల పారేసి స్టెన్‌గన్ భుజాన ధరించిన కర్మవీరుడు షె. క్యూబా స్వాతంత్ర్యం కోసం నిద్రాహారాలు మాని పోరాడి, అది సాధించాక అయిదారేళ్ళలో ఆ ప్రశాంత జీవనం కొనసాగించ నిచ్చగించక 1966 లో బొలీవియాలో నియంతృత్వానికి వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధం మొదలుపెట్టి అందులోనే ఆహుతి అయిన లాటిన్ అమెరికన్ అభిమన్యుడు షె.

షె తల్లి సీలియా బాల అసాధారణ వ్యక్తి. యవ్వనంలో ఆమె స్త్రీ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొంది. అర్జెంటీనాలో కారు నడిపిన మొదటి మహిళ ఆమె! జుత్తు కత్తిరిలచుకున్న మొదటి స్త్రీలలో ఆమె వుంది! బ్యాంక్ చెక్‌లమీద తన పేరు సంతకం చేసిన మొదటి ఆడది ఆమె. ఆమె

స్వేచ్ఛా ప్రియత్వాన్ని తెలివితేటలను హర్షించి ఆమోదించేవాడు షె నాన్న. షె తన పోరాట తత్వాన్నే కాక, అనారోగ్యాన్ని కూడా అమ్మనుండె వారసత్వంగా పొందాడనడంలో ఆశ్చర్యం లేదు.

తల్లితండ్రులు చర్చికి వెళ్ళేవారు కాదు గనక షె జీవితంలో చర్చి ప్రసక్తేలేదు. తల్లిదండ్రుల గ్రంథాలయంలో వున్న స్పానిష్, రష్యన్ భాషలలోని పూర్వకాల సాహిత్యంతోబాటు, చరిత్ర, కళలు, మనస్తత్వ శాస్త్రం, మార్క్స్, ఎంగిల్స్‌ల రచనలు, డ్యూమా, విక్టర్ హ్యూగో, జాక్ లండన్, గోర్కీ, టాల్‌స్టాయ్ వంటి వారి సృజనాత్మక రచనలు- లాటిన్ అమెరికన్ సాంఘిక నవలలు, అన్నిటినీ ఔపాసన పట్టాడు బాలుడు షె. కవిత్వమంటే అతడికి ప్రాణం. బొదిలేర్, వెర్లయిన్ లోర్కా, పాబ్లొ నెరూడాల కవితల నాతడు ఆస్వాదించాడు. అంతేకాదు. అతడు స్వయంగా కవితలు రాసేవాడు. ఎప్పుడూ తన తలగడ క్రింద దాచుకునే 'రెయిన్ డేర్' అనే కవిత సంపుటి రచయిత, స్పానిషా కవి లియాన్ ఫిలిప్స్‌కు రాసిన వుత్తరంలో షే తన్ను 'గమ్యం చేరని కవి' గా వర్ణించుకున్నాడు. చిట్టచివరి రోజులలొ బొలివియాలొ నియంతృత్వంలో నిర్దయతో ఆకలితో, అనారోగ్యంతో చివరి శ్వాసదాకా పోరాడుతున్న సమయంలో కూడా తన సంచిలో తన డైరీతోబాటు తనకు నచ్చిన కవితలు రాసుకున్న పుస్తకం మోసిన మనిషి షే. అంచేత అతడు తాను "కవిని కాలేక పోయిన విప్లవ వీరుడి" నన్నాడు. "విప్లవ వీరులు కాలేకపోయిన కవుల" గురించి తెలుగువారికి చెప్పనక్కరలేదుకదా!

షే మంచి చిత్రకారుడు చెస్ ఆటలో దిట్ట. సంగీతం అంటే అతడికి ప్రాణం. లెక్కలు వేయడంలో ప్రవీణుడు. సైక్లింగ్‌లో చాంపియన్, ఫుట్ బాల్, గోల్ఫ్, గుర్రపు స్వారీ అతడికి నచ్చిన క్రీడలు. ఒక మోపెడ్ కంపెనీ ప్రకటన నిమిత్తం నాలుగువేల కిలోమీటర్ల దూరం ఏకబిగిన మోపెడ్ స్వారీ చేసాడు షే. ఇంతటి పూర్ణపురుషుడు వైద్యం చదివాడు.

కుష్ఠురోగుల సేవలో నిమగ్నుడయ్యాడు. తన ఇరవై యేడవఏట, 1955 లో జులై 9 న అతడు క్యూబన్ విప్లవవీరుడు ఫిడెల్ కాస్ట్రోని మెక్సికో నగరంలో కలిశాడు. అది నవచరిత్రకు నాందిక్షణం. ఆ క్షణం నుంచి కాస్ట్రో శ్రీకృష్ణుడిలా, షే అర్జునుడిలా కలిసి-లాటిన్ అమెరికన్ నియంతల గుండెలకు చిచ్చు పెట్టారు. ఆ కీలుబొమ్మల సూత్రధారి అమెరికాను గడగడ లాడించారు.

అర్జెంటైనా నియంత పెరాన్‌కు వ్యతిరేకంగా జరిగిన విప్లవ పోరాటంలో షే తల్లిదండ్రులు ముఖ్యపాత్ర వహించారు. పోలీసులతో పోరాటానికి కావలసిన బాంబులు వాళ్ళింట్లోనే తయారయ్యేవి. ఆ వాతావరణంలో పెరిగిన షె వంటి కర్తవ్యశీలుడు ఇంతింతై వటుడింతయై అన్నట్లుగా ఎదిగి- "లాటిన్ అమెరికాలో ఏదేశమేగినా నేను విదేశీయుడిగా అనుకోలేదు. గ్వాటిమురా మెక్సికో, పెరూ, క్యూబాలలో నేను అయా దేశాలవాడిగానే భావించాను, అన్నాడు. ఇంకో సందర్భంలో, "నేను అర్జెంటినాలో క్యూబాలో మసిలాను. కాని లాటిన్ అమెరికా అంతా నా దేశాలే ఇందులో ఏ దేశానికి ఏ అవసరం ఎప్పుడొచ్చినా వాటి స్వాతంత్ర్య సంపదల కోసం నా ప్రాణాలొడ్డడానికి సంసిద్ధమే!" అని చెప్పగలిగాడు. చెప్పటమేకాదు చేసిచూపించాడు! తన మాట మేరకు క్యూబాలో పోరాడి అక్కడ నియంతృత్వం నశించాక, బొలివియా వెళ్ళి అక్కడ పోరాటంలో అసువులు బాశాడు! హవానాలో జరిగిన లాటిన్ అమెరికన్ దేశాల ఐక్యతా సంస్థలో 'షే' ని "లాటిన్ అమెరికన్ పౌరుడిగా గుర్తించి, అతడికా హక్కు నిచ్చారుకాని నిజంగా ముమ్ముందు వసుధైక కుటుంబం అంటూ ఏర్పడితే ప్రపంచ పౌరులుగా గాంధీ నేతాజీ, బోస్, మావో, హాల్డేన్, వంటి వారితో బాటు మొదటి పంక్తిలో నిలబడవలసినవాడు షే!

అక్కడి పరిస్థితులను బట్టి, శత్రువుల ఎత్తుగడలను బట్టి'షె' గెరిల్లా ద్ధపతిలో పోరాడాడు. హింసను హింసతో ఎదుర్కొన్నాడు. కాని అతడి

ఆశయము, ఆచరణ గమనించితే ప్రజా జీవితంలో పాల్గొనేవారికి చాలా గుణపాఠాలున్నాయి.

స్పెయిన్‌లోనియంత ఫ్రాంకొను ఎదిరించి పోరాడిన ఆల్బర్టో మేయోని తన ఉద్యమానికి గురువుగా ఫీడెల్ కాస్ట్రో ఎన్నుకున్నాడు. గెరిల్లరీకి 150 ప్రశ్నలు అన్న-పుస్తకం రచించిన ఈమేయో లెక్కల 'మేష్టారుగా" జీవిస్తూ -- షె వంటి వీరుల్ని తయారు చేసాడు. షె అతిశ్రద్ధగా గెరిల్లా పద్ధతులను అభ్యశించి నూటికినూరుపాళ్ళు తెలుసుకుని రంగప్రవేశం చేసాడు. క్యూబా పోరాటాంలో మొదటి ప్రయత్నంలో బాగా దెబ్బలుతిన్న సందర్భంలో షె "విప్లవ పోరాటంలోకూడా ఊహించినది వేరు, వాస్తవం వేరుకావడం వల్ల నెత్తురుచిందితే కాని సరయిన పాఠం నేర్వలేక పోయాము. ఓటమి మా కళ్ళు తెరిచింది. మేము కొన్ని ఎత్తులు వేయటంలో పొరపాటు చేసాము. మార్పుకోవా లని జనం గుర్తించారు. కాని మేము ఆ మార్పుతీసుకురాగలం అన్న విశ్వాసం వారిలో లేకపోయింది అది సాధ్యం అని వారికి నచ్చచెప్పడమే మన తక్షణ కర్తవ్యంఅయింది" అన్నమాటలు మనదేశంలో రాజకీయాల్లో దద్యోధన ప్రియులనునుండి దుందుడుకు వాదులదాక పరిశీలించదగినవి, నక్సలిజమైనా, సర్వోదయమైనా, ఇంకోయిజమైనా ఇంకొకటయినా ప్రజలు కూడా నడవనిదే ఉద్యమాలకు బాలారిష్టం తప్పదని చరిత్ర చెప్పింది.

అంతేకాదు – ఉద్యమ నాయకులు ఎలా వుండాలో ఇంకో సంఘటన చెబుతుంది.

క్యూబా స్వాతంత్ర్యం పొందాక షె ఉన్నతాధికారిగా ఉన్న రోజు లలో రేషన్ కార్డుల పద్ధతి ప్రవేశ పెట్టారు. షె క్రింద పనిచేసే వారందరు ఒక రోజు సమావేశమై వారి వారి కుటుంబాల కోటాల గురించి మాట్లాడ సాగారు. వారిలో కొందరు తమకు నిత్యావసర వస్తువులు సరిగా దొరకడం లేదని ఫిర్యాదు చేయగా షే అది సరికాదని చెబుతూ, ఉదాహరణకు తన కుటుంబానికి అన్నీ కావలసినంత దొరుకుతున్నాయన్నాడు.

వెంటనే ఒకతను నవ్వుతూ-"మీరు పెద్ద అధికారికదా... మీ కోటా ఎక్కువ వుంటుంది" అన్నాడు. అది విని బాధ పడిన షె మ రో రో జు సమావేశంలో - నేను కనుక్కున్నాను. మీరు చెప్పింది నిజమే! మా కార్డు మీద కోటా ఎక్కువ వుంది. ఆదోషాన్ని సరిదిద్దించాను!" అని చెప్పాడట.

షే కాకుండా క్యూబా ఉన్నతాధికారులందరూ చెఱకుపైరు కోతల వంటి కార్యాలలో పాల్గొనేవారట! ఇది తెలుసుకున్నా, టాం జా ని యా అధ్యక్షుడు తన రేషన్ కోటానుస్వయంగా జనులతోబాటు 'క్యూ' లో నిల బడితీసుకుంటాడని చదివినా-మన నా య కు ల కు ప్రజలకు మధ్య ఎంత "సాన్నిహిత్యం'' వుందో కొట్టవచ్చినట్లు తెలుస్తుంది. ... "యద్యాచరతి" శ్రేష్టః తత్తదే వేత రో జనః (పెద్దలు ఎలా చేస్తారో సామాన్యులు అలా చేసారు.) అన్న సూక్తికి ప్రాణం ఏదో బోధపడుతుంది.

కార్యాచరణమునుమించిన సూక్తి లేదు- అన్న జూన్ మార్పిమాటను జీవించినవాడు షె. మాటలకు చేతలకు తేడాలేని అద్వైత జీవనం అతడిది. అతడి బలహీనతలు మూడేనట - పొగాకు, పుస్తకాలు, చెస్ఆట! శారీరక సుఖాల కతడి జీవితంలో ప్రాధాన్యం లేదు. కారడవిలోనయినా, క్యూబాలో పదవిలోనున్నా, చాలా తక్కువ సౌకర్యాలతో ఒక యో గి లా జీ విం చే వాడతడు కీర్తి ప్రతిష్టలు పెరిగి ప్రజలు మెచ్చుకుంటున్నప్పుడు అ త డు రొమ్ము విరుచుకోలేదు.

అతడితో పాటు పోరాడిన కెప్టన్ అంటోనియా "ఆస్త్మా అనుక్షణము పీడిస్తున్నా కాళ్ళీడ్చుకుంటూ తనబరువు తాను మోసుకుంటూ నడుస్తున్న షెని చూస్తే అతడి వజ్ర సంకల్పం తెలిసి వచ్చేది. తాను నమ్మిన ఆశ యాల మీద అచంచల విశ్వాసమే అతడికా బలాన్నిచ్చింది" అన్నాడు. "గెరిల్లా సన్యాసిలా, యోగిలా, వుండాలి. అని నిర్వచించిన షె అలాగే జీవిం చాడు "గెరిల్లా నాయకుడు ఎవరూవేలెత్తి చూపని విధంగా నడుచుకోనాలి,''

అన్న షె ఆ విధంగానే బ్రతికాడు. మాటలకు చేతలకు వ్యత్యాసం లేని ఆదర్శ జీవితం ద్వారానే విరోధులకన్నా నైతికంగా ఎత్తున నిలబడగలగాల న్నదే అతడి పరమాశయము.

అలాంటి వ్యక్తులు ఒక్కొక్కరు ఒక్కొక్క మహాశక్తి అవతారం అనడంలో సందేహం లేదు. ముప్పై, నలభై మందితో ఏ లాటిన్ అమెరికన్ దేశంలోనయినా విప్లవ పోరాటం ప్రారంభించవచ్చు,''నని షె అన్నప్పుడు ఆ వ్యక్తులు ఆదర్శప్రాయులయి వుండాలనే అర్థం.

సార్త్రె ఒక వ్యాసంలో షెని నిజమైన విప్లవ కారుడిగా వర్ణిస్తూ.... ''ఒకసారి షెయే తన్ని తాను ఇలా వర్ణించు కున్నాడు. ––"ఫిడెల్ కాస్ట్రో నాకన్నా తెలివిగలవాడనయితే సంపాదించవచ్చునేమో గాని, కాస్ట్రోతో నాకన్న గాఢంగా ఏకాభిప్రాయం గలవాడిని మాత్రం కలవలేడు––."'' అని చెబుతాడు.

ఆ నరనారాయణుల సంబంధం ఎంత గాఢమైనదో! "విప్లవ దిశలో నాకన్న ముందున్నవాడు షె. ఆశయ నిరతిలో, విద్యలో, నిబ్బరంలో అతడు నాకన్న పైమెట్టు మీద వున్నవాడు '' –– అన్నాడు కాస్ట్రో.

మధ్యాహ్న మార్తాండుడివలె మండే ఆశయం. దానిని కార్యరూపంలో పెట్టగల చిత్తశుద్ధి, స్వీయసుఖాలను లెక్కచేయని త్యాగనిరతి వుంటే ఆ జీవితం ఎక్కుపెట్టి విడచిన బాణంలా దూసుకుపోయి లక్ష్యాన్ని సాధించి తీరుతుంది అని మనకు మళ్ళీ ఒకసారి ఋజువు చేసిన మహా మహుడు షె గువేరా!